

# కథా కౌముది

"శ్రీ పరాభవ" నామ సంవత్సర ఉగాది సందర్భంగా
వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా వారు నిర్వహించిన
31 వ ఉగాది ఉత్తమ రచనల పోటీ లో
ఉత్తమ కథానిక విభాగం - ప్రశంసా పత్రం

## కొన్ని సమయాల్లో కొందరు మనుషులు

దేశరాజు, హైదరాబాద్

**చప్పట్లు.. చప్పట్లు..**

అందరూ అదిరిపడ్డారు.

మామూలుగా చప్పట్లు కొడితే అందరూ అభినందన పూర్వకంగా స్వీకరిస్తారు.

కానీ, ఇవి అలాంటి చప్పట్లు కాదు. అరచేయి, అరచేయి చరచడం వల్ల పుట్టిన చప్పట్లు.

అందుకే అందరూ చిరాగ్గా ఉలిక్కిపడి చూశారు.

''అదేంటి.. నువ్వు కాఫీలు కలుపుతున్నావ్? క్యాటరింగ్‌కు చెప్పలేదా అక్కా?''

''అన్నీ అయ్యాయి. వాడు నీకుమల్లే, నాకుమల్లే ఊరు తెల్లారకుండా వచ్చేసి కూర్చుంటాడేమే''

''మరి ఈ కాసినీ ఎవరికి సరిపోతాయే?''

''మన మట్టుక్కునే తల్లీ. వాళ్లంతా బయటకు వెళ్లారులే, తాగడానికి''

అక్కచెల్లెళ్ల సంభాషణకు అంతరాయం కలిగిస్తూ ''అమ్మా, మన గుమ్మం వరకు ఊడ్చా? సరిపోతుంది కదా?'' అంటూ అడిగింది పనిమనిషి.

''ఏమో వచ్చి చూస్తా వుండు. ముందు నువ్వొచ్చి కాఫీ తీస్కో'' అని కిచెన్ గట్టుకు నడుం ఆనించి కాఫీ తాగడంలో మునిగింది.

ఇంతలోనే ఏదో గుర్తొచ్చినట్టు ''ఏయ్.. మీ బావకు ఫోన్ చేసి పాల ప్యాకెట్లేమైనా దొరికితే ఓ రౌండు పట్టుకు చక్కారమ్మను'' అని చెల్లెలకు పురమాయించింది.

''సరే. వాట్సప్ పెడతాలే''

''ఏం, నేను పెట్టలేనా? ఆయన చూసుకోడు. మళ్లీ వెళ్లమంటే ఎక్కడలేని నీరసాలూ వచ్చేస్తాయి. ఫోన్ చెయ్యి'' అని ఆదేశించింది.

ఇంతలో చిన్న కొడుకు వచ్చాడు. వెనకాలే వాడి స్నేహితులిద్దరు నిలబడి వున్నారు.

''అమ్మా, అన్ని గుమ్మాలకీ బంతిపూల దండలు కట్టేసాం. మామిడి ఆకులు కూడా పెట్టేశాం. మిగిలినవి పూజ దగ్గర పడేసాం. ఇక మేం బయటికి వెళ్లి టిఫిన్ అదీ చేసి వస్తాం'' అన్నాడు

''పడేసాం అనకూడదు, పెట్టాం అనాలి. అయినా, నువ్వు టిఫిన్ తిన కూడదురా. కావాలంటే కాఫీ ఇస్తా తాగు''

''ఊరుకో.. నువ్వూ, నీ చాదస్తం. వాడేమైనా పీటల మీద కూర్చుంటాడా? తిన్నీలే. లేపోతే మధ్యాహ్నం వరకూ వుండొద్దు. అందులోనూ ఈ పంతులుగారు అసలే చండశాసనుడు. ఓ పట్టాన తెమల్చడు'' అని తోసిపుచ్చింది చెల్లెలు.

తల్లి ఏమీ మాట్లాడకపోవడంతో పిల్లలు అక్కడ్నించి జారుకున్నారు.

మహానగరం మహానగరంగా మారడానికి కారణమైన అపార్ట్‌మెంట్లలో అదో హైరైజ్ అపార్ట్‌మెంట్. ఇంకా చుట్టూ నిర్మాణ పనులు నడుస్తూనే వున్నాయి. ఎక్కడికక్కడ కంకర, సిమెంట్, ఇసుక, ఇనుప చువ్వలు ఆ అపార్ట్‌మెంట్ చుట్టూ ఆక్రమించుకుని వున్నాయి. ఇంకో రెండు టవర్లు నిర్మాణంలో వున్నాయి. పూర్తయిన ఒక టవర్ను అప్పగించడంతో ముహూర్తాలు చూసుకుని ఒక్కొక్కరూ గృహప్రవేశాలు చేస్తున్నారు. మొత్తం అంతా పూర్తయ్యాక, వుడ్ వర్క్, ఫాల్స్ సీలింగ్ పూర్తి చేసుకుని అప్పుడు గృహ ప్రవేశం చేసుకుంటే బావుంటుందని ఆయన అనుకున్నారు. వచ్చిన బంధువులు, సహోద్యోగులు చూడటానికీ, కాసేపు కూర్చోవడానికి వీలుగా వుంటుందని ఆయన ఉద్దేశం. కానీ, సెలవులకు అమెరికా నుంచి వచ్చిన కొడుకు, కోడలు అంతవరకు ఆగలేరు కాబట్టి, ఇలా హడావిడిగా కానియ్యడానికి ఒప్పుకున్నారు.

కాసేపటికి కాఫీలు, టీల కోసం వెళ్లినవాళ్లు, టిఫిన్‌లు చేసినవాళ్లు అందరూ వచ్చేశారు. వాళ్లతోపాటు దగ్గర బంధువులు కూడా ఒక్కొక్కరూ రావడం మొదలెట్టారు.

''ఆంటీ, ఏంటాంటీ? మరీ తోరణాలు కట్టేసి వదిలేశారు. మంచి ముగ్గులు వేయలేదు.'' అంది ఒకామె.

''నేనిక్కడ బిజీగా వుండి చూడలేదు. నిన్నేయమని అనను లేగానీ, నీ దగ్గర వుంటే చూపించు. అది వేస్తుంది. అన్నట్టు కలర్లూ అవీ లేవు సుమా. కలర్ చాక్ పీసులు మాత్రం వున్నాయి'' అని వివరించింది.

పని మనిషి ముడేసిన చున్నీని వెనక్కి సర్దుకుంటూ ముచ్చటపడిపోయింది.

''ఎంతసేపాంటీ బ్లింకిట్‌లో పెడతా'' అంది.

''బ్లింకిట్, బిగ్ బాస్కెట్టూ ఇక్కడికి రావాలంటే ఇంకా టైమ్ పడుతుంది. ఇప్పుడీ మూలకు ఎవ్వడూ రాడు. ఏం కావాలన్నా మనం కార్లేసుకుని, బళ్లేసుకుని పోవాల్సిందే. పొద్దున్న టీ తాగడానికని కార్లలో వెళ్లిన వారు రావడానికే గంటన్నరపట్టింది'' ఆమె పరిస్థితి వివరించింది.

''పర్లేదమ్మా.. కలర్ చాక్పీసులున్నాయి. ఏద్దాం'' అంటూ ముందుకు కదిలించింది పని మనిషి.

ప్రత్యేకంగా పూజ గది అంటూ వున్నా, దాంట్లోకి ప్రస్తుతం దెయ్యాలు కూడా వచ్చేలా లేకపోవడంతో హాల్లోనే పూజ ఏర్పాట్లు చేసుకున్నారు. తనతోపాటు తీసుకువచ్చిన ఇనుప తట్టను అక్కడే పక్కనబెట్టి, అందులో కాస్త ఇసుకపోయమని సెలవిచ్చారు పంతులుగారు.

''శుక్లాంభరదరం..'' అంటూ ఆయన ప్రారంభించేసరికి పెద్ద కొడుకు, కోడలు; పెద్దవాళ్లిద్దరూ పీటల మీద కూర్చొన్నారు.

''ఈయనకి చాదస్తం ఎక్కువే బాబూ. మాట వినడు. అక్కడికీ మీ బావ కూడా చెప్పారు 'కాస్త త్వరగా కానీయండి' అని 'అలాగే' అన్నాడనడానికి, కానీ తెమల్చడు. నాకు తెల్సుకదా. ఇంతకుముందు ఎన్నిసార్లు చూడలేదూ? ఇంతకీ చెప్పొచ్చేదేమిటంటే, నువ్వు కాస్త వంటిల్లు కనిపెట్టుకుని వుండు. కాఫీ పొడి, సుగర్ చూసుకుని వెయ్యి. ఏవైనా అయిపోయాయో, చచ్చామన్నమాటే. రెండు కిలో మీటర్ల వరకూ మన మొర వినే నాథుడు వుండడు'' అని అక్క ముందే చెప్పడంతో వంటింటికీ, హాలుకీ మధ్యలో నిలబడి కార్యక్రమం చూస్తోంది చెల్లెలు.

అప్పటికే వచ్చిన వాళ్లలో కింద కూర్చోగలిగిన వాళ్లు పరిచిన దుప్పటి మీద కూర్చొన్నారు. మిగిలిన వాళ్లు నిలబడే చూస్తున్నారు. కాళ్లు నొప్పి పెడితే, కాస్త అటూఇటూ నాలుగడుగులు వేసి వస్తున్నారు.

ఇంతలో చప్పుడు చేసుకుంటూ సప్లయిర్స్ వాడొచ్చాడు. గబగబా అందరికీ కుర్చీలు వేసి, ఏదో వాడింట్లో శుభ కార్యానికి అందరూ వచ్చినట్టు ''కూర్చోండి సార్, కూర్చోండమ్మా'' అని మర్యాదలు చేశాడు. పూజ మధ్యలోంచి అటువేపు దృష్టిసారించిన ఆయనకేసి ఓసారి చూసి నమస్కారం కూడా పెట్టాడు.

ఎవరికి చెబుతున్నాడో తెలియకుండా ''అబ్బో సానా దూరం వుందమ్మా. లిఫ్ట్ కూడా చిన్నగుంది. రెండుమూడుసార్లు తిరగాల్చొచ్చింది'' అనుకుంటూ బయటకు వెళ్లిపోయాడు.

పూజా కార్యక్రమం ట్రాక్‌లో పడింది. ఒకదాని తర్వాత ఒకటి చకచకా సాగిపోతున్నాయి. బంధువులు కూడా ఒకరితర్వాత ఒగరుగా వచ్చి కుర్చీల్లో కూర్చొంటున్నారు. పూజలో వున్న దంపతులను మౌనంగానే పలకరిస్తున్నారు.

ఇంతలో పంతులుగారు తన మంత్రాల ప్రవాహాన్ని ఆపి, కాస్త గొంతు తగ్గించి ''అమ్మా.. ప్రసాదం మీరు చేస్తున్నారా? ఆర్డర్ పెట్టేశారా?'' అని పెద్దావిడను అడిగారు.

''మీరు మరీ స్వామీ, ఆర్డర్ పెట్టడం ఏంటి. నేనే చేస్తాను'' అందావిడ చనువుగా.

''అదేంటమ్మా. తప్పేమీ లేదు. నడుస్తున్న కాలమాన పరిస్థితుల ప్రకారం పోవాలి మనం. ఆర్డర్ పెట్టడం అంటే ఇంకేమీ లేదు. క్యాటరింగ్ వాళ్లే తెస్తారా అని నా ఉద్దేశం. అంతే. రైట్ మీరే చేస్తా అన్నారుగా. శుభం. మీరు లేవచ్చు. వెళ్లి ఆ పనేదో చూసుకోండి. వీలైతే నాతో వచ్చిన వీళ్లిద్దరికీ కాస్త కాఫీ చుక్క మీ చేత్తో ఇప్పించండి. చాలు'' అన్నాడు గుక్క తిప్పుకోకుండా.

''వాళ్లకేం ఖర్మ. మీక్కూడా ఇస్తా'' అందావిడ నవ్వుతూ.

ఆయన కళ్లు పెద్దవి చేసి, నోటి మీద చూపుడు వేలేసుకుని.. తల అడ్డంగా ఊపాడు.

ఆవిడ లేస్తుంటే కోడలు సాయం చేసింది.

వెంటనే ఆయన కోడలి వైపు తిరిగి ''తల్లీ మీరు కూడా లేవచ్చు. ఇంతసేపూ కింద కూర్చొన్నారు కదా. కాళ్లు పట్టేసి వుంటాయి. కాసేపు కుర్చీలో కూర్చుని చాపుకోండి. వచ్చిన వాళ్లని పలకరించండి. వస్తున్నవారికి దారి చెప్పండి. లేపోతే ఎలాగూ వాట్సప్ వుండనే వుందికదా, చూసుకోండి'' అన్నాడు నవ్వుతూ.

అక్కడే కుర్చీల్లో కూర్చున్న బంధువుల్లో ఒకావిడ ''బాగా చెప్పారు స్వామీ. వచ్చిన వాళ్లని పలకరించడం మాటెలా వున్నా. రాబోయే వారికి దారి చెప్పడం మాత్రం చాలా ముఖ్యమండోయ్. లేకపోతే నానా తిప్పలు తప్పవు'' అంది.

ఆ మాటలకు పంతులుగారు నవ్వేసి, మరి సంభాషణ పొడిగించ కుండా తర్వాత కార్యక్రమంలోకి వెళ్లిపోయాడు.

కానీ, కోడలు పట్టించుకుంది. ''అదేంటాంటీ, మీ అమ్మాయికీ వాళ్లకి లోకేషన్ షేర్ చేశాం కదా?'' అంది.

వెంటనే ఆవిడ సద్దుకుని ''అయ్యో చెయ్యలేదని అనడం లేదమ్మా. లోకేషన్ బయట గేటు వరకే చూపిస్తుంది కదా. తర్వాత లోపలకు ఎలా రావాలి. కారెక్కడ పెట్టుకోవాలి. లిఫ్ట్ ఏ వైపుంది. అవన్నీ షేర్ చేయలేరుకదా ఎవరైనా? అక్కడక్కడ కూలీలూ వాళ్లూ వున్నారుగానీ వాళ్లది మన భాష కాదు'' అంది.

కోడలికి ఏమనాలో తోచలేదు. ''అక్కడ్నించే ఫోన్ చేయాల్సింది. నేనే వచ్చి పైకి తీసుకొచ్చేదాన్ని'' అని గబగబా అక్కడ్నించి వెళ్లిపోయింది.

ఈ సంభాషణంతా విన్న పెద్దావిడ చెల్లెలు సంతోషంతో ఉబ్బితబ్బిబ్బు అవుతూ వంట గదిలోకి వెళ్లి, జరిగిదంతా అక్కకు నివేదించింది.

''అమ్మో గట్టిదేనేమ్ నీ కోడలు. మాటకు మాట ఇచ్చిందనుకో. మామూలుగా అయితే, ఆ పిన్నిగారి నోట్లో నోరెట్టాలంటే మనమే భయపడి చస్తాం'' అని ప్రశంసించింది.

''లేపోతే అందరూ మనలా పడతరా?''

''అయినా, చదువుకుని ఉద్యోగం చేస్తున్న పిల్ల ఎందుకు పడాలి?''

''అంటే, మనమేమైనా అడుక్కు తింటున్నామా?''

''ఆఁ.. మన చదువులు, ఉద్యోగాలు వేరు. వాళ్లకి డాలర్లు వస్తాయి కదా. మనకు ఎంత ఏడ్చినా రూపాయిలేనాయె''

''నీ కొడుక్కీ ఎవత్తినో కట్టబెడితే, నీకూ డాలర్లు తెచ్చే కోడలే వస్తుంది''

''దొరకద్దూ, నీ కోడల్లాంటి ఉత్తమురాలు. పూజా అదీ కూడా బానే చేస్తోంది. రోజూ అలవాటుందటనా?'' ఆరాగా అడిగింది చెల్లెలు.

''రోజూ దీపం పెడుతుందమ్మా అని వాడంటాడు. నాకైతే అనుమానమే అనుకో. ఇవాళ చూశాక, రోజూ కాకపోయినా పండక్కీ పబ్బానికీ అయినా పెడుతుందని అర్థమైంది''

''మొత్తానికి అత్తగారిననిపించుకున్నావే. కోడలను పొగిడితే ఒప్పుకోవు కదా''

వీళ్ల సంభాషణను ఆటంకపరుస్తూ, ఎవరో వచ్చి 'పంతులుగారు ప్రసాదాలు తెమ్మంటున్నారు' అన్నారు.

ఇద్దరూ అన్నీ సర్దుకుని పట్టుకెళ్లి అక్కడ పెట్టారు. ఆయన వాటినోసారి చూసి ''మహా నైవేద్యం'' అన్నారు.

''తెమ్మనమని చెప్పాం. ఇంకా రాలేదు మరి. ఆలస్యమవుతుందో ఏమో?'' సందేహంగా అందావిడ.

''ఆలస్యమే. కార్యక్రమం అన్నాక ఆలస్యం కాకుండా వుంటుందా? ఇంతకీ ఎవరూ?'' అన్నారు.

''మనవాళ్లే. ఎప్పుడూ చేసే ఆవిడకే చెప్పాం''

''ఎవరు, ఆవిడా, ఆవిడ ఎక్కడ్నుంచి రావాలీ? వంటలు చేసుకుని వచ్చేసరికి సాయంత్రమైపోతుంది. ఓసారి ఫోన్ కొట్టండి. చేతిలో వున్నదేగా'' అన్నారు.

ఆవిడ హడావిడిగా తన ఫోన్ వెతుక్కుంటూ లోపలకు వెళ్లింది. ఇంతలో ఎదురొచ్చిన కోడలు ''ఆంటీ, అందరూ నిద్రపోతున్నారు. కొంతమంది నీరసంగా కనిపిస్తున్నారు. అప్పుడే టు అయిపోయింది'' అంది.

''నేను కూడా అదే టెన్షన్ పడుతున్నా. స్వామి కూడా మహా నైవేద్యం అంటూ కూర్చొన్నారు. నీ దగ్గర నెంబర్ వుంటే ఓసారి ఆవిడకు చెయ్యి'' అంది

ఆమె గబగబా చేసి, మాట్లాడింది. ఫోన్ కట్ చేసి ''వచ్చేసారట ఆంటీ. నేను లిఫ్ట్ వరకూ వెళ్లి చూసొస్తా'' అని వెళ్లింది.

కాసేపటికి వంటలు వస్తున్న సందడి అందరినీ మేల్కొల్పింది. వాళ్ల అరుపులు, కేకలు కంటే, ఆ వాసనలతోనే అక్కడి వాళ్లందరికీ ప్రాణాలు లేచి వచ్చాయి.

ఇంతలో కాస్త లావుగా వున్నావిడ, ఎంబ్రాయిడరీ క్లాత్ కప్పిన వెడల్పాటి పళ్లెం పట్టుకుని లోపలకు వచ్చింది.

పంతులుగారు తమలపాకుతో ఓ పక్కన నీళ్లు జల్లి, చేయిచూపించారు.

ఆమె కాస్త ఎడంగా నిలబడి, ఆ పళ్లెం అక్కడ పెట్టింది.

ఆయన నెమ్మదిగా ''ఆలస్యం చేసేశారు'' అన్నాడు

కానీ ఆవిడ పెద్దగా నోరు తెరిచి, చేతులు తిప్పుకుంటూ ''మేం చేసిందేం లేదండి. గంటైదండి వచ్చి. ఇక్కడిక్కడే తిరుగుతున్నాం. లిఫ్ట్ ఎక్కడుందో తెలీదు. ఆటో ట్రాలీ దూరంగా పెట్టుకుంటే, అన్నీ మోసుకు రావడం కష్టమైపోతుంది కదండీ. ఎక్కడ చూసినా కనబడలేదు. లాస్ట్‌కి కోడలుగారు వస్తే, తీసుకుని వచ్చామండి'' అంది.

బంధువుల్లో ఒకాయన అందుకున్నాడు. ''హేవీ లేదు. ఇంత ఖర్చు పెట్టుకుంటున్నారు కదా. ఒక రెండు ఫ్లెక్సీలు చేయించేసి బయటొకటి, లిఫ్ట్ ఎంట్రన్స్ దగ్గరొకటి కట్టేస్తే ఎవరికీ ఇబ్బంది వుండేది కాదు'' అన్నాడు.

''సరే, సరే ఐపోయింది కదా. కానీవ్వండి. అందరికీ సుగర్లు డౌన్ అవుతున్నాయి'' అన్నాడు మరొకాయన నవ్వుతూ.

మొత్తానికి కార్యక్రమం అయిందనిపించి, అందరూ భోజనాలు మొదలు పెట్టారు.

అదిగో అప్పుడు మోగాయి చప్పట్లు. అందరూ చిరాగ్గా చూస్తూ దూరంగా జరుగుతున్నారు. తింటున్న వాళ్లంతా ఆకు వారికి కనబడకుండా మరోవైపు తిరిగి నిలబడ్డారు.

''లొకేషనూ అన్నీ వున్నా, రావాలంటే మనం నానా చావూ చచ్చాం. వీళ్లు మాత్రం పుటుక్కుమన ఊడిపడతారు'' ఎవరో అన్నారు.

అందరికీ వినబడిందిగానీ, అందరూ విననట్టే వున్నారు.

చిన్న కొడుకు, స్నేహితులు వాళ్లని అడ్డుకున్నారు. గొడవ మొదలైంది. పెద్దాయన రాక తప్పలేదు. వస్తూనే ''ఇదిగో, ఇది తీసుకుని వెళ్లండి'' అంటూ రెండు ఐదొందల నోట్లు ఇచ్చాడు.

వాళ్లు వాటిని ముట్టుకోనే లేదు.

''ఇంత పెద్ద అపార్ట్‌మెంట్ కొన్నావుగా కోట్లు పెట్టి. మాకు వందలిస్తావా?'' అన్నారు.

పాతిక వేలు ఇస్తేనేగానీ కదలమని మొడికేశారు. పెద్ద కొడుకు, కోడలు కూడా వచ్చారు. వాళ్లు ఎవరి మాటా వినడం లేదు. అంతా గోలగోలగా వుంది.

ఇక లాభం లేదని ఆవిడ చెల్లెలు రంగంలోకి దిగింది. ''బావగారూ, ఇంకో రెండు వేలు ఇవ్వండి. వాళ్లే పోతారు'' అంది.

వాళ్లు ససేమిరా అన్నారు.

''ఇలా అడుక్కు తినడం కాదు. కష్టపడి సంపాదించుకోవాలి. సిగ్గులేకుండా అంత కావాలి, ఇంత కావాలి డిమాండ్ ఒకటి'' అని కోప్పడింది.

వాళ్లు చప్పట్లు కొట్టడం తప్ప మాట్లాడలేదు. ఈమె తిట్లూ ఆపలేదు.

చివరకు అందరూ కలిసి పదకొండు వేలకి బేరం కుదిర్చారు. ఆ డబ్బులు తీసుకుని వాళ్లు వెళ్లారు.

ఇక అక్కడ్నించి అందరూ తమ కసిదీరా వాళ్లని తిట్టుకున్నారు.

''మనం మరోసారి రావాలంటేనే చాలా కష్టం. వీళ్లు మాత్రం ఇట్టే వచ్చేస్తారు'' ఎవరో అన్నారు.

''వాళ్ల నెట్ వర్క్ అంత పవర్‌ఫుల్‌గా వుంటుందండీ బాబూ. వాళ్లు ఎక్కడికైనా వచ్చేస్తారు'' అలా అందరూ తలోమాటా మాట్లాడారు.

ఇంతలో వెళ్లాల్సినవాళ్లు చెయ్యి కడగ్గానే వెళ్లారు. కొందరు నాలుగు దాటాకా కాఫీలు తాగి వెళ్లారు. అందరికీ ముందే నిర్ణయించుకున్న ప్రకారం బట్టలు, గిఫ్టులు ఇచ్చి పంపారు.

ఇక అప్పుడు అక్కా చెల్లెళ్లిద్దరూ ఓ బెడ్రూమ్‌లో కిందన వేసిన బెడ్ షీట్‌పై కూర్చుని మిగిలిన చీరలు, అవీ బయటకు తీశారు.

''నీకు పెడదామని ఇది తీసుకున్నానే. మిగిలినవి కూడా చూసి నీకు నచ్చింది తీసుకెళ్లు'' అంది అక్క.

''ఇప్పుడెందుకే ఈ బట్టలు ఇవన్నీ'' అంది చెల్లెలు మామూలుగా.

''ఏం లేదు, ఇల్లు వాడి పేరు మీద కదా తీసుకున్నాం. అంటే డబ్బులు కూడా వాడివే అనుకో. వాళ్లు చేసుకుంటున్న మొదటి శుభకార్యం కదా. అందుకని..'' వివరించింది అక్క.

ఇద్దరూ ఆ కబురూ, ఈ కబురూ చెప్పుకుంటుండగానే నాలుగు దిక్కులూ ముళ్లడ్డాయి. చీకట్లు కమ్మేశాయి. అందరూ వెళ్లిపోయారు. మిగిలినవారు వాళ్లనీ, వీళ్లని దింపడానికి వెళ్లారు.

''ఆగవే, మీ బావ వస్తారు కదా. మనం కలిసి వెళదాం'' అంది అక్క

''ఇప్పటికే చాలా ఆలస్యం అయిపోయింది. పిల్లలు ఏం చేస్తున్నారో ఏమో. నేను బయల్దేరతా. నాలుగడుగులు వేస్తే ఏదో ఒకటి దొరుకుతుంది. మెయిన్ రోడ్డుకి వెళితే ఇంక దిగులు లేదు'' అని ఎంత చెప్తున్నా వినకుండా బయల్దేరిపోయిందామె.

''అంతగా అయితే, దింపడానికి వెళ్లి వచ్చే వాళ్లలో ఎవరో ఒకరు ఎదురుపడతారు కదా. కంగారేం లేదులే'' అని అక్కకు సద్ది చెప్పింది.

కానీ, బయట పరిస్థితి భిన్నంగా వుంది.

అంతా చీకటి. లైట్లు దేదీప్యమానంగా వెలుగుతున్నా సరిపోవడం లేదు. రోడ్డు మీదకు వచ్చి చూసుకుంటే, కనుచూపు మేర వెనగ్గానీ, ముందుగానీ ఎవరూ లేరు. చెట్ల మీద పురుగులవీ ఎగురుతున్నాయి. ఇంకేవో రొద చేస్తున్నాయి. ఒక్క క్షణం ఆమెకు భయం వేసింది. వెంటనే హ్యాండ్ బ్యాగ్‌లోంచి ఫోన్ తీసి చేత్తో పట్టుకుంది. చీకటితోనే లేచి వచ్చిందేమో అలసటగా అనిపించింది. ఇంకా వేగంగా నడవడానికి పట్టు చీర అడ్డం పడుతోంది.

ఆమె భయాన్ని రెట్టింపు చేస్తూ కాస్త దూరంలో ఎవడో తూలుకుంటూ వస్తూ కనిపించాడు. అక్కడెక్కడైనా పని చేసేవాడేమో. ఈమెను చూడగానే రోడ్డుకు అటువైపు నుంచి ఇటువైపు వచ్చి దగ్గరగా వస్తున్నాడు.

ఆమెకు చెమటలు పట్టేశాయి. ఏం చేయడానికీ పాలుపోలేదు. 'ఫోన్ చేసినా ఎవరొస్తారు? ఇదేమైనా సినిమానా ఢాం అంటూ ప్రత్యక్షం కావడానికి'. ఆమెకు అన్నీ పిచ్చిపిచ్చి ఆలోచనలు వస్తున్నాయి. 'దింపడానికి వెళ్లినవాళ్లు ఎవరైనా తిరిగొస్తుంటే బాగుండును' అనుకుంది.

అవేవీ జరగలేదు. కానీ, ఆమె అనుకోని జరిగింది. వాడు దగ్గరగా వచ్చి ఏమాత్రం భయం లేకుండా ఆమె గుండెలను తాకబోయాడు.

ఆమె పిచ్చి ఆవేశంతో ''ఏయ్.. పోరా. చంపెస్తా. లం..కొడకా. మావాళ్లు వస్తున్నారు. మర్యాదగా వెళ్లు'' అని కేకలు పెట్టింది, బూతులు తిట్టింది.

వాడు వినే స్థితిలో లేడు. తూలుతూనే ఆమెను తాకే ప్రయత్నం చేస్తున్నాడు. కొంగు పట్టుకుని ఓసారి గుంజాడు. ఆమె విడిపించుకుని అటూ ఇటూ పరుగులెడుతోంది. సరిగ్గా అప్పుడే ఒక ఆటో వాళ్లని దాటుకుని వేగంగా ముందుకు వెళ్లి ఆగింది. అంతే వేగంగా అందులోంచి నలుగురైదుగురు దిగి పరిగెట్టుకుంటూ వాళ్ల దగ్గరకు వచ్చారు.

వాళ్లని చూడగానే వాడు కాస్త తగ్గాడు. కానీ వాళ్లు ఏమాత్రం తగ్గలేదు.

‘‘ఏందిరా, బాయి కావాలా? నాకాడుంది రారా ఇస్తా’’ అని వాడి తలకాయ అందుకుని తన గుండెలకు వేసి బాదింది. దాంతో వాడికి దిమ్మతిరిగిపోయింది. మరొకరు వాడి చొక్క పట్టుకుని గుంజి ‘‘దా మనం చేసుకుందాం’’ అని మీదకు వెళ్లి తన్నరాని చోట తన్నారు. వాడు కింద పడిపోయాడు. మరో ఇద్దరు వాడ్ని పట్టుకుని లాగి రోడ్డు పక్కన పడేశారు.

అప్పటికి ఆమె కుదుటపడింది. కళ్లల్లో నీళ్లు నిండగా చేతులు రెండూ జోడించి దండం పెట్టింది.

‘‘అరె ఏం కాదులే, రా రోడ్డు కాడ దింపుతాం’’ వాళ్లు ఆమెను ఆటో ఎక్కించుకున్నారు.

ఆటో వెల్తురులో ఆమె వాళ్లను గుర్తు పట్టింది. మధ్యాహ్నమే వాళ్లని నానా తిట్లు తిట్టింది. ‘అందరినీ ఎత్తుకుపోయి ఇలా మారుస్తారని. పనీపాటా లేకుండా బేవార్స్‌గా తింటారని..’ ఇంకా ఎన్నో. అవన్నీ వాళ్లకి గుర్తుకు వస్తే? నన్ను గుర్తుపడితే? అనుమానంతోనే ఆటో ఎక్కింది. ఆటోలో వాళ్లేమీ అనకపోయేసరికి వాళ్లు గుర్తుపట్టలేదని అనుకుంది.

కాసేపట్లో ఆటో సెంటర్‌లో ఆగింది. అలవాటైన ట్రాఫిక్కు, లైట్లు, వెహికిల్సూ ఆమెకు ధైర్యాన్నిచ్చాయి. ఆటో దిగి బ్యాగ్‌లో వెతికి దొరికిన ఆరు ఐదొందల నోట్లు బయటకు తీసింది.

‘‘అరె తీయ్.. ఏమొద్దు మంచిగా ఇంటికిపో. బావ సూస్తుంటాడు. నీ అసుంటి మర్యాదగలోల్లు కారుల్ల పోవాలి. ఇంకెప్పుడు తెలీని జాగల ఒంటరిగా పోకు’’ అని సర్రున దూసుకుపోయారు.

అప్పుడు అర్థమైంది ఆమెకి, వాళ్లు తనను గుర్తుపట్టారని.

ఆమె గుండె దుఃఖంతో బరువెక్కిపోయింది. కళ్లలోంచి కృతజ్ఞతాశ్రువులు జలజలా రాలాయి.

★★★